### ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. కలకోట సరిత, W/o రవి, D/o లచ్చయ్య R/o. బండపల్లె గ్రామం, చందుర్తి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన H.No. 1-1e (part)కు చెందిన ఖాళీస్థలం, దీని విస్తీర్ణం: 968.00 చ.గజాలు, గొళ్ళపల్లి, కొలనూర్ గ్రామం, కోనరావుపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 13-06-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

### ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. 1) బైరగోని హరీష్ S/o రాజేశం, 2) బైరగోని మహేష్ S/o రాజేశం, R/o. బౌసాయిపేట గ్రామం, కోనరావుపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో వారి యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం, దీని యొక్క విస్తీర్ణం: 1210.00 చ.గజాలు, దీని యొక్క సర్వే నెంబరు 219/1/1/1/2, బౌసాయి పేట గ్రామం, కోనరావుపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 13-06-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

### ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. 1) కాసారపు వంశీకృష్ణ S/o కిషన్, 2) కాసారపు గోపీకృష్ణ S/o కిషన్, R/o. వట్టెమ్ల గ్రామం, వేములవాడ మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో వారి యొక్క స్వంత ఆస్తి అయిన గూన ఇల్లు దీని యొక్క H.No. 4-74, మరియు దీని యొక్క ఖాళీస్థలం మొత్తం విస్తీర్ణం: 292.50 చ.గజాలు, వట్టెమ్ల రెవెన్యూ గ్రామం, వేములవాడ మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 13-06-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★Wanted Female Accountants, Qul: B.Com(Accounts), Exp: 2 Yrs in Tally Software, Job Location Karimnagar, Salary: 12K-15K per Month, Negotiable, Interested candidates can send resume: 8977919477 (Whatsup), email: anilcholleti.ca@gmail.com.
NTK-350007

### గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




## కార్యకర్తలకు చల్మెడ పరామర్శ



అనుపురంలో నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చల్మెడ

వేములవాడ రూరల్, జూన్ 13 : వేములవాడ మండలం అనుపురం, రుద్రవరం గ్రామంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు. అనుపురంలో బీఆర్ఎస్ కార్యకర్త చిట్ల సతీశ్ తండ్రి నారాయణ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. రుద్రవరంలో బీఆర్ఎస్ కార్యకర్త పార్వతి శ్రీకాంత్ తండ్రి చిరంజీవి మల్లయ్య మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, నాయకులు హరికృష్ణ, కట్ట తిరుపతిగౌడ్, చిట్యాలి అశోక్, పార్వతి అంజి, మహేశ్, ఎర్రకొక్కుల దేవయ్య, అశోక్, బక్కయ్య, కిషన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, జూన్ 13: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం చందుర్తి మండలం మూడపెల్లిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, మండలాధ్యక్షుడు రామస్వామి, మాజీ సర్పంచ్ ఏసుదాస్ నాయకులు మోహన్ ఉన్నారు.

## రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి బదిలీ

- ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో రాధాబాయి

వేములవాడ టౌన్, జూన్ 13 : వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి బదిలీ అయ్యారు. వారి స్థానంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయిని ఆలయ ఇన్‌చార్జి ఈవోగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో రాధాబాయి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపంలో అర్చకులు వారికి వేదోక్త ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం అందజేశారు. కాగా ఆలయ ఈవో విధులు నిర్వర్తించిన వినోద్‌రెడ్డిని దేవాదాయశాఖ కార్యాలయంలో మల్టీజోన్ 2 డీసీగా బదిలీ అయ్యారు. ఇక్కడ ఆలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## విమాన ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళి



నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వీర్నపల్లి/గంభీరావుపేట, జూన్ 13: ఆహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మండలంలోని గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు వెంగల శ్రీనివాస్, గజన్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, బలరాం, మంజుల, శ్రీనివాస్, కవిత, శేఖర్, తదితరులున్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద గుజరాత్ విమాన ప్రమాద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలంటూ రాత్రి గ్రామస్తులు ఘన నివాళులు అర్పించారు. ఇక్కడ పురోహితులు రాచర్ల పార్థసారథి శర్మ, గ్రామస్తులు గంట అశోక్, సంతోష్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటి యాదవ్, రాజశేఖర్, నాగరాజుగౌడ్, తదితరులున్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక




నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్

సిరిసిల్ల టౌన్, జూన్ 13: యాదవులు అన్ని రంగాల్లో తమా వాటా కోసం ఉద్యమించాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యవర్గ సమేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సంఘం భవిష్యత్ కార్యక్రమాల కోసం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నట్లు తెలిపారు. వీరిలో జిల్లా అధ్యక్షుడిగా బొబ్బల మల్లేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల మహేందర్ యాదవ్, న్యాయ విభాగం అధ్యక్షుడిగా యమునాయాదవ్, గౌరవ సలహాదారులుగా శుభోదయం శ్రీనివాస్ యాదవ్, తోట్ల రాములు యాదవ్, రాష్ట్ర కార్యదర్శిగా జగ్గాని మల్లేశ్ యాదవ్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. సమావేశంలో గొల్లకురుమల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్, రాష్ట్ర కార్యదర్శి వీరవేని మల్లేశ్‌యాదవ్, నాయకులు వాసం మల్లేశ్ యాదవ్, అంబటి సంతోష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మరదలి అంత్యక్రియలకు వచ్చి..

- గుండెపోటుతో కుప్పకూలిన బావ
- వేములవాడలో ఘటన.. కరీంనగర్‌లో విషాదం



పసుల కిషన్ (ఫైల్)

వేములవాడ, జూన్ 13: అనారోగ్యంతో మృతి చెందిన మరదలి అంత్యక్రియలకు హాజరైన ఆమె బావ.. గుండెపోటుతో అక్కడే కుప్పకూలాడు. ఈ ఘటన వేములవాడలో చోటుచేసుకోగా, కరీంనగర్ జిల్లా కేంద్రంలో విషాదం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ పట్టణం సాయినగర్‌లోని బోనాల వీధికి చెందిన కోల రామూర్తి సోదరి నర్సవ్వ(50) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాపువాడకు చెందిన పసుల కిషన్ (నర్సవ్వ బావ) రాత్రి వేములవాడకు చేరుకున్నాడు. నర్సవ్వ అంత్యక్రియలు పూర్తయిన తర్వాత బంధువులందరూ ఇంటికి చేరుకుని రోధించారు. అందరినీ ఓదార్చిన తర్వాత కిషన్(72) ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. గమనించిన బంధువులు హుటాహుటిన అతడిని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే గుండెపోటుతో మృతిచెందాడని వైద్యులు తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లో కిషన్ అంతిమసంస్కారాలు నిర్వహించారు. కాగా, మరదలి అంత్యక్రియలకు వచ్చి బావ మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొన్నది.

# ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్




సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్

సిరిసిల్ల టౌన్, జూన్ 13: ప్రభుత్వం రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తునన్నాయని ఆరోపించారు. 1వ తరగతి నుంచే దాదాపు రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు అనుమతించకుండా సొంతంగా ముద్రించిన పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం సైతం ఈ విషయంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నదని అన్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల మధ్య సామాజిక అంతరం ఏర్పడుతుందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సదరు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలులోకి తేవాలని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ నాయకులు ఎస్కే బాబా, సాయిదీపక్, వెంకటరమణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఈఎంఆర్ఎస్‌లో స్థానిక సిబ్బంది తొలగింపు

- ఇప్పటికే నార్త్ టీచర్లతో సమస్యలు
- భాష తెలియక విద్యార్థులు సతమతం
- నిరసనకు సిద్ధమవుతున్న బాధితులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 13: గతమెంతో ఘనమైన దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉత్తర భారత టీచింగ్ స్టాఫ్ బోధన అర్థంకాక సతమతమవుతున్నారు విద్యార్థులు. ఈ తరుణంలో తమ సమస్యలు చెప్పేందుకు ఉన్న స్థానిక బోధన, బోధనేతర సిబ్బందిని సైతం పదిమందిని తొలగించడంతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఇక్కడ చదివిన ఎంతోమంది డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్లు, ఇతర ఉద్యోగాలు పొందారు. ఈ గిరిజన గురుకుల విద్యాలయంలో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నది. కొన్నేండ్లుగా పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను, వంట సిబ్బంది పది మందిని తొలగించడంతో సిబ్బంది నిరసనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. అసలు గిరిజన గురుకులంలో ఏండ్ల నుంచి పనిచేస్తున్న సిబ్బందిని తొలగించడం వెనుక ఏమైనా ఉంటుంది. పాఠశాలలో జరిగే కొన్ని విషయాలపై సిబ్బంది ప్రశ్నిస్తున్నందునే వారిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. దీనిపై దుమాల ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ మంజీత్‌ను వివరణ కోరగా సిబ్బంది ఎంపికలో ఈఎంఆర్ఎస్ పాఠశాలకు సంబంధంలేదన్నారు. జిల్లా స్థాయి ఎంపిక కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఉంటాడన్నారు. సిబ్బంది పనితీరును బట్టి కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీ సిబ్బందిని ఎంపిక చేస్తారని తెలిపారు.

## ఆలయ రోడ్డు భూ నిర్వాసితులకు పరిహారం చెక్కులు పంపిణీ



నిర్వాసితులకు పరిహారం చెక్కులు అందిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రాధాబాయి

కలెక్టరేట్, జూన్ 13 : వేములవాడ పట్టణంలో ఆలయ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో చెక్కులు పంపిణీ చేశారు. కాగా ప్రభుత్వం నుంచి ఇప్పటికే భూ నిర్వాసితుల కోసం రూ.47 కోట్లు వచ్చి ఉన్నాయి. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రాధాబాయి కలెక్టరేట్‌లో అధికారులు చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడలోని 40 మంది భూ నిర్వాసితులకు చెక్కులు అందజేశారు. ఇక్కడ వేములవాడ ఆర్డీవో, రెవెన్యూ అధికారులున్నారు.

## కోడెల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



కోడెల కోసం వచ్చిన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

వేములవాడ టౌన్, జూన్ 13 : కోడెల సంరక్షణకు అత్యంత పాధాన్యమివ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం వేములవాడ రాజన్న ఆలయ గోశాల నుంచి దరఖాస్తు చే సుకున్న అర్హులైన రైతులకు 50 జతల కోడెలు అందజేశామని తెలిపారు. శుక్రవారం వరకు 750 కోడెలను రైతులకు అందజేశామని వెల్లడించారు. గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధాకృష్ణా రెడ్డి, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని అధ్యాపకుల ప్రచారం

రుద్రంగి, జూన్ 13: పదో తరగతి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కళాశాల ఇన్‌చార్జి పిన్సిపాల్ వాణి, అధ్యాపకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా విద్యా బోధన చేస్తున్నామన్నారు. విద్యార్థులను విధిగా కళాశాలకు పంపే విధంగా కృషి చేయాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉద్యోగులకు వైద్య శిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది

సిరిసిల్ల టౌన్, జూన్ 13: జిల్లా కేంద్రంలోని సినారె కళామందిరంలో శుక్రవారం మెడికవర్ హాస్పిటల్ (కరీంనగర్) ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందికి మెడికవర్ వైద్యులు గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ పబ్బ అనీష్ మాట్లాడుతూ, గుండె సంబంధిత వ్యాధు లు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దాదాపు 200 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ వాణి, ఇంజినీర్ రఘు, మెడికవర్ సిబ్బంది కోట కరుణాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్ ఉన్నారు.

## 16న సీపీఐ జిల్లా మహాసభలు

సిరిసిల్ల రూరల్, జూన్ 13: జిల్లా కేంద్రంలో ఈనెల 16న సీపీఐ జిల్లా నాల్గవ మహాసభలు జరగన్నాయని, ఈ మహా సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరు కానున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ (టెక్స్‌టైల్ పార్క్)లో సీపీఐ మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను సీపీఐ సీనియర్ నాయకురాలు సిద్దమ్మ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్‌హాలులో ఈనెల 16న సీపీఐ జిల్లా మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. మహాసభలకు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజఏల్లవ్వ, బాలవ్వ, శంకర్, ఆనంద్, రాజేందర్, మల్లవ్వ, కమలవ్వ, రాధా, రమణ, అంజలి, గీత, చంద్ర, పోశవ్వ, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ మండల కమిటీ ఎన్నిక

సీపీఐతంగళ్లపల్లి మండల కమిటీని ఏడుగురి ఎన్నుకున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు తెలిపారు. మండల కమిటీ కార్యదర్శిగా సోమనాగరాజు, సహాయ కార్యదర్శిగా బాచుపల్లి శంకర్, కోశాధికారిగా రాజు ఎన్నికయ్యారు. వీరితోపాటు పిట్టల నాగరాజు, జక్కని సద్దెవ్వ, సోమ ఎల్లవ్వ, ఎల్ల సత్తవ్వతో పాటు మరో 16 మందితో మండల కౌన్సిల్‌ను ఎన్నుకున్నామని పేర్కొన్నారు.

## యువకుడి దారుణ హత్య

- గాజు సీసాలతో మెడపై కోసిన గుర్తు తెలియని వ్యక్తులు



సతీశ్ (ఫైల్)

గంభీరావుపేట, జూన్ 13: మండలంలోని లింగన్నపేటకు చెందిన మెండె సతీశ్ (32) యువకుడు శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామ శివారున యువకుడిని ఖాళీ బీరు సీసాలతో మెడ, కడుపుపై పొడిచి హత్య చేసినట్లు గుర్తించారు. దీంతో రక్తపు మడుగులో సతీశ్ మృత దేహం పడి ఉండడాన్ని చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు వ్యవసాయం, గొర్రెల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ ప్రేమానందం పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. హత్యకు గల కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. సతీశ్‌కు భార్య భార్గవి, ఇద్దరు కొడుకులు ఉన్నారు. దీంతో లింగన్నపేటలో ఒక్కసారిగా విషాద చాయలు అలుముకున్నాయి.

### చాంద్‌నగర్ మసీదు కమిటీ ఎన్నిక

కోనరావుపేట, జూన్ 13: మండలంలోని నిజామాబాద్ గ్రామ పరిధిలోని చాంద్‌నగర్‌లో మసీదు కమిటీని నూతనంగా ఎన్నుకొన్నారు. చైర్మన్‌గా సయ్యద్ మస్తాన్, సభ్యులుగా మొగల్, బడేమియా, కరీం, చాంద్, మదర్ ఇమామ్, సలీం, గౌస్‌పాషా, యూకుబాబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



గంభీరావుపేట : ముస్తఫానగర్ పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట/వేములవాడ రూరల్/ఇల్లంతకుంట/కోనరావుపేట/చందుర్తి , జూన్ 13: జిల్లాలోని పలు పాఠశాలల్లో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పలుచోట్ల అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కోనరావుపేట రామన్నపేటలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, సభ్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

### 'ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య'

వేములవాడ టౌన్, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బడిబాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల దుస్తులు,పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అర్బన్ మండల విద్యాధికారి బన్నాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇండ్లల్లో చోరీలు

వేములవాడ/కోనరావుపేట, జూన్ 13: వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్ రాజేశం ఇంట్లో లక్క పద్మ అద్దెకు ఉంటుండగా శుక్రవారం చోరీ జరిగింది. 15రోజుల క్రితం పద్మ తమ బంధువుల ఇంటికి వెళ్లగా శుక్రవారం వేములవాడకు తిరిగి వచ్చింది. ఉదయం వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించింది. దీంతో పోలీసులు చేరుకొని విచారించగా బాధితురాలు సుమారు తులంనర బంగారు అభరణాలతోపాటు 12తులాల వెండి పట్టీలు కొంత నగదు అపహరణకు గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే సదరు అనుమానితుడు అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడినట్లుగా సీసీ కెమెరాల్లో అనుమానితుడి ఛాయాచిత్రాలు నమోదు కాగా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కోనరావుపేట మండలంలోని కనగర్తి గ్రామంలో వంగపల్లి శంకర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. గురువారం రాత్రి సమయంలో శంకర్ తన ఇంటికి తాళం వేసి సోదురుడి ఇంట్లో పిల్లలతో కలిసి నిద్రించేందుకు వెళ్లాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ చేశారు. ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండి, వస్తువులు చిందరవందరగా పడవేసి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రూ.10వేల నగదు అపహరించినట్లుగా బాధితుడు శంకర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే డ్వాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీ చేయించారు.

## యువకుడి ఆత్మహత్య

ఇల్లంతకుంట, జూన్ 13 : మండలంలోని జంగంరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పండుగ చక్రపాణి (43) శుక్రవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం, చక్రపాణి తల్లి, భార్య తరచూ గొడవలు పడడం వల్ల పలుమార్లు పెద్దమనుషులతో నచ్చజెప్పినా వినకపోవడంతో విసిగిపోయి మనస్థాపంతో గురువారం క్రిమి సంహాకర మందుతాగాడు. కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని పేర్కొన్నారు. చక్రపాణి అన్న అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి 10 సంవత్సరాల కూతురు ఉన్నది.

## దరఖాస్తుల ఆహ్వానం

చందుర్తి, జూన్ 13: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో వినయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో అర్హులైన విద్యార్థులను ఈనెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 25, 26 తేదీల్లో జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు క్రీడా పాఠశాలలలో 60 మంది బాలురు, 60 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు జూన్ 15 సాయంత్రం 5 గంటల్లోపు వెబ్‌సైట్ http://tgss.telangana.in//లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఇల్లంతకుంట, జూన్ 13: స్పోర్ట్స్ స్కూల్‌లో చదువాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అని పేర్కొన్నారు. ఆన్‌లైన్ చేసుకున్న విద్యార్థులు ఈ నెల 18న మండలంలోని గాలిపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ, జూన్ 13: వేములవాడ పట్టణంలోని సాయి రక్ష జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు తనిఖీల్లో భాగంగా శుక్రవారం పట్టుకున్నట్లు తెలిసింది. సుమారు 5 క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకొని స్టేషన్‌కు తరలించి విచారించినట్లు సమాచారం.

## గ్రామాల్లో ముగిసిన రెవెన్యూ సదస్సులు

సిరిసిల్ల రూరల్, జూన్ 13 : తంగళ్లపల్లి మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు ముగిశాయి. శుక్రవారం తంగళ్లపల్లి మండలం తాడూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. శుక్రవారంతో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు తహసీల్దార్ జయంత్‌కుమార్ వెల్లడించారు. మండలంలో అత్యధికంగా జిల్లెల్ల నుంచి 96 ఫిర్యాదులు, అతి తక్కువగా వేణుగోపాలపూర్ నుంచి 4 ఫిర్యాదులు వచ్చాయన్నారు. మొత్తం 362 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రశాంతంగా రెవెన్యూ సదస్సులు ముగిశాయని, అర్జీలను త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇక్కడ ఆర్ఐ దిలీప్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## బద్దెనపల్లిలో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు

సిరిసిల్ల రూరల్, జూన్ 13 : తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని రైతు వేదికలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు రైతులకు సేద్యంపై అవగాహన కల్పించారు. ఇక్కడ వ్యవసాయ కళాశాల ఆసోసియేట్ డీన్ సునీతాదేవి, వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేందర్, చిరంజీవి, ఏవో సంజీవ్, ఉద్యానవనశాఖ అధికారి గోవర్ధన్, తదితరులున్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్ పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్, జూన్ 13 : జిల్లా స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్స్ అడ్మిషన్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఇక్కడ జిల్లా యువజన క్రీడల అధికారి అజ్మీరా రాందాస్, డీపీవో షర్ఫొద్దీన్, డీఎల్పీవో నరేశ్ ఉన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాసిన బీజేపీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు

వేములవాడ, జూన్ 13: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదకొండేళ్ల పరిపాలనలో కార్మికుల హక్కులను కాలరాసిందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు విమర్శించారు. శుక్రవారం ఆయన వేములవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పదకొండు సంవత్సరాల బీజేపీ పాలనలో 44 కార్మిక చట్టాలు ఎత్తివేసి నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల పొట్ట కొట్టే విధంగా విధానాలకు పాల్పడిందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అనేక కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు దారాదత్తం చేసిందని ఆరోపించారు. ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జూన్ 17న హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాజు ల పోశెట్టి, కుమ్మరి కొమురయ్య, కోరెపు శ్రీనివాస్, ఎల్ల దేవరాజు, స్వామి, దప్పు శ్రీనివాస్, అంజి తదితరులున్నారు.